
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

గురువారం 14 మార్చి 2024



సూపర్-6 పథకాలతో ఇంటిల్లిపాదికి ఆర్థిక లబ్ధి

టీడీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొర

- అనంతగిరి మండలంలో విస్తృతంగా ప్రచారం
- ఉమ్మడి ప్రభుత్వం రాగానే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వెల్లడి
- వైసీపీని గద్దె దించాలని పిలుపు

8

వలంటీర్లతో వైసీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం

టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.సింహాచలం ఆరోపణ



వలంటీర్లు పంచుతున్న కరపత్రాన్ని చూపుతున్న టీడీపీ నేత సింహాచలం

పాడేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చేయని అభివృద్ధి, సంక్షేమంపై వైసీపీ ప్రభుత్వం గ్రామ వలంటీర్లతో తప్పుడు ప్రచారం చేయిస్తున్నదని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడ సింహాచలం ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడప గడపకు ప్రభుత్వ సంక్షేమం పేరిట కరపత్రాలను ముద్రించి గ్రామ వలంటీర్లతో ఇంటింటా ఎన్నికల తరహా ప్రచారం చేస్తున్నారన్నారు. వాస్తవానికి పథకాలు అందని వారి ఇంటికి సైతం వలంటీర్లు వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని నిర్ధారిస్తూ వేలిముద్రలు వేయించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇంట్లో తాను లేనప్పుడు తమ ప్రాంత గ్రామ వలంటీర్ వచ్చి గడప గడపకు ప్రభుత్వ సంక్షేమం కరపత్రం ఇచ్చి కుటుంబ సభ్యులతో ట్యాబ్‌లో వేలిముద్ర వేయించుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి లబ్ధి చేకూరని కుటుంబాలతో సైతం వేలిముద్రలు వేసుకోవడం తగదన్నారు. కేవలం వైసీపీ ప్రచారానికి మాత్రమే వలంటీర్లను వినియోగించుకుంటున్నారని, తమ ఇళ్లకు వలంటీర్లు వస్తే వేలి ముద్రలు వేయవద్దని ఆయన సూచించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.10
సహరి (శుక్ర)	4.52

విస్తరణ జరిగే మార్గమేది?

పాడేరు మెయిన్ రోడ్డు అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితం

- ప్రత్యేక నిధులిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రకటించినా ఫలితం శూన్యం
- వైసీపీ ప్రభుత్వం స్పందించకపోవడమే కారణం
- సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

పాడేరు మెయిన్ రోడ్డు విస్తరణ పనులు జరిగేలా కనిపించడం లేదు. రహదారి విస్తరణ జరిగితే ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని అధికారులు భావించినా వైసీపీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఇది కార్యరూపం దాల్చేలా లేదు. రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి శ్రద్ధ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు విమర్శిస్తున్నారు.



పాడేరు మెయిన్ రోడ్డు వ్యూ

జిల్లా కేంద్రం పాడేరులోని ప్రధాన రహదారుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపలేదు. స్థానిక రహదారుల విస్తరణకు ప్రత్యేకంగా నిధులు ఇస్తామని ఆరు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ప్రకటించినా ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఉన్నతాధికారుల సూచనలతో మెయిన్‌రోడ్డు విస్తరణకు అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రూపొందించడంతో పాటు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు రాలేదు. కాగా త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండడం, ఎన్నికలు జరగనుండడంతో ఇక పాడేరు మెయిన్‌రోడ్డు విస్తరణ ఇప్పట్లో జరిగి అవకాశం లేదని స్పష్టమవుతున్నది.

విస్తరణ జరిగితే ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం

పాడేరు మెయిన్‌రోడ్డు విస్తరణతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని చాలా కాలంగా అధికారులు భావిస్తున్నారు. గతంలో రెవెన్యూ డివిజన్ కేంద్రం, ఐటీడీఏ ప్రధాన కేంద్రంగా ఉన్న పాడేరు 2022 ఏప్రిల్ నుంచి జిల్లా కేంద్రం కావడంతో వాహనాల రద్దీ పెరిగింది. అలాగే విశాఖపట్నం నుంచి ఒడిశా రాష్ట్రానికి రాకపోకలు సాగించాలంటే పాడేరు మీదుగా వెళ్లాలి. ఈ క్రమంలో పాడేరు పట్టణంలోని ప్రస్తుతం ఉన్న రోడ్లు ఇరుకుగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యతో పాటు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్లను విస్తరించాలని అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ భావించారు. ఇందులో భాగంగా మెయిన్‌రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ పెద్దలను కోరారు.



గతేడాది మే నెలలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించిన దృశ్యం(ఫైల్)



విస్తరణ చేపట్టే పాడేరు మెయిన్ రోడ్డు

ప్రతిపాదనలు ఇలా..

పాడేరులో మెయిన్‌రోడ్ల విస్తరణలో భాగంగా స్థానిక అంబేడ్కర్ కూడలి సెంటర్ పాయింట్‌గా.... అటు అరకులోయ వెళ్లే మార్గం, ఇటు విశాఖపట్నం వెళ్లే రోడ్డు, మరో వైపు చింతపల్లి వెళ్లే రహదారి ఉంది. అంబేడ్కర్ సెంటర్ నుంచి ఆయా మూడు మార్గాల్లోని మెయిన్ రోడ్డును మూడు కిలోమీటర్ల దూరం వరకు విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. అలాగే ప్రస్తుతం పాడేరు నుంచి చింతపల్లి వెళ్లే రోడ్డు 21 అడుగులుండగా, అరకులోయ, విశాఖపట్నం వెళ్లే రోడ్లు 30 అడుగులు చొప్పున వెడల్పున్నాయి. దీంతో మూడు రోడ్లను 54 అడుగులుగా విస్తరించాలని, దానిలో ఇరువైపులా ఆరేసి అడుగుల చొప్పున(మొత్తం 12 అడుగులు) నడకదారి, మధ్యలో 42 అడుగుల తారురోడ్డు వేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందుకు సుమారుగా రూ.30 కోట్ల వరకు వ్యయం అవుతుందని ఒక అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేశారు. అంబేడ్కర్ కూడలి సెంటర్ పాయింట్‌గా మూడు వైపులా మూడు కిలో మీటర్ల విస్తీర్ణంలో రోడ్డు వెడల్పునకు అవసరమైన స్థల సేకరణకు సంబంధించిన కొలతల పనులను రెవెన్యూ, రోడ్లు, భవనాల శాఖాధికారులు గత ఏడాది చేపట్టారు.

రోడ్డు వెడల్పునకు సంబంధించిన ప్రణాళికను రోడ్లు, భవనాల శాఖ రూపొందించి కలెక్టర్‌కు సమర్పించగా, దానిని పరిశీలించి జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. గతేడాది అక్టోబరు నెల 8, 9 తేదీల్లో ఇక్కడ పర్యటించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డితో అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ చర్చించి పాడేరు మెయిన్ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు ఆయన అంగీకరిస్తూ ప్రత్యేక నిధులు విడుదల చేస్తామన్నారు. దీంతో అధికారులు హడావుడిగా రోడ్డు విస్తరణకు అవసరమైన డీపీఆర్, ప్రతిపాదనలు సిద్ధం చేసి గతేడాది డిసెంబరులోనే ప్రభుత్వానికి సమర్పించారు. కానీ ఇప్పటికీ దానిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం వల్లే దీనిపై స్పష్టత రాలేదని స్థానిక అధికారులు భావిస్తున్నారు. రోడ్ల అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వానికి శ్రద్ధ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు పెదవి విరుస్తున్నారు.



బలిమెల నీటి పంపకాలపై సమీక్ష

బలిమెల జలాశయం నీటి వినియోగంపై చిత్రకొండలో సమావేశమైన ఇరు రాష్ట్రాల అధికారులు

సమావేశమైన ఆంధ్రా, ఒడిశా అధికారులు

బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో నీటి నిల్వలు 44.1013 టీఎంసీలు

ఏపీ వాటాగా 19.8782, ఒడిశా వాటాగా 24.2232 టీఎంసీలు

సీలేరు, మార్చి 13: ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై ఆంధ్రా, ఒడిశా అధికారులు బుధవారం ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండలో సమావేశమయ్యారు. బలిమెల జలాశయంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం తమ వాటాగా ఎంతెంత నీటిని వినియోగించుకుందో లెక్కలు కట్టారు. 2023- 2024 నీటి సంవత్సరంలో జూలై 2023 నుంచి ఫిబ్రవరి 2024 వరకు ఆంధ్రా తమ వాటాగా 47.8099 టీఎంసీల నీటిని వినియోగించుకుందని(2022 - 2023 నీటి సంవత్సరంలో ఆంధ్రా.. ఒడిశా కంటే అదనంగా వినియోగించుకున్న 13.7578 టీఎంసీలతో కలిపి), ఒడిశా తమ వాటాగా 43.4649 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఆంధ్రా.. ఒడిశా కంటే 2024 ఫిబ్రవరి చివరి నాటికి 4.3450 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు నిర్ధారించారు.

ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో మొత్తం 44.1013 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని, ఇందులో ఆంధ్రా వాటాగా 19.8782 టీఎంసీలు, ఒడిశా వాటాగా 24.2231 టీఎంసీలుగా పంపకాలు జరిపారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్, ఇరిగేషన్ అవసరాల నిమిత్తం ఆంధ్రాకు మార్చి నెలాఖరు వరకు 2500 క్యూసెక్కులు, ఒడిశాకు 1300 క్యూసెక్కుల ... మిగతా 8వ పేజీలో

ప్రమాదాల్లో గోల్డెన్ అవర్‌పై అవగాహన కల్పించాలి

అధికారులకు కలెక్టర్ విజయసునీత ఆదేశం



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ విజయసునీత

పాడేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యమైన గోల్డెన్ అవర్‌పై విస్తృత ప్రచారం చేసి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ విజయసునీత ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాలు, గోల్డెన్ అవర్‌పై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రమాదం జరిగిన మొదటి గంట ...మిగతా 8వ పేజీలో

టికెట్ టెన్షన్!

నేడు టీడీపీ మలి జాబితా విడుదల

- ఆశావహుల్లో ఉత్కంఠ
- చోడవరం టికెట్ రేస్‌లో కేఎస్ఎన్ఎస్ రాజు, తాతయ్యబాబు, మల్లునాయుడు పేర్లు
- మాడుగుల రేసులో పీవీజీ కుమార్, గవిరెడ్డి, పైలా
- అధిష్ఠానం పరిశీలనలో మాజీ మంత్రి బండారు



బి.తాతయ్యబాబు



జి.మల్లునాయుడు



కేఎస్ఎన్ఎస్ రాజు

- జనసేన తరపున పెందుర్తి నుంచి పంచకర్ల, ఎలమంచిలి నుంచి సుందరపు..
- బీజేపీకి అనకాపల్లి ఎంపీ స్థానం
- అధిష్ఠానం పరిశీలనలో సీఎం రమేశ్ పేరు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన, బీజేపీల మధ్య పొత్తు కొలిక్కి రావడంతో అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్టీల అధినేతలు దృష్టిసారించారు. అనకాపల్లి పార్లమెంటు నియోజక వర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను పొత్తులో భాగంగా టీడీపీ నాలుగు, జనసేన మూడు స్థానాల్లో పోటీ చేయాలని ఇప్పటికే నిర్ణయించాయి. టీడీపీ నర్సీపట్నం, పాయకరావుపేటలకు, జనసేన అనకాపల్లికి అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. చోడవరం, మాడుగులకు టీడీపీ ఎలమంచిలి, పెందుర్తికి జనసేన పార్టీ గురువారం అభ్యర్థులను ప్రకటించే అవకాశం వుందని తెలిసింది. చోడవరం, మాడుగుల టికెట్లను ముగ్గురేసి చొప్పున ఆశిస్తున్నారు. జనసేనకు కేటాయించిన పెందుర్తి నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ బరిలో దిగడం దాదాపు ఖాయమైంది. ఇక బీజేపీకి కేటాయించిన అనకాపల్లి లోక్‌సభ నియోజక వర్గం నుంచి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పోటీ చేస్తారని తెలిసింది.

తెలుగుదేశం, జనసేన పార్టీలు మలి విడత జాబితాలను, భారతీయ జనతా పార్టీ తొలి జాబితాను గురువారం ప్రకటించ నున్నట్టు సమాచారం రావడంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది. నర్సీపట్నం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ పేర్లను ఆయా పార్టీల అధినేతలు తొలి విడత జాబితాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక టీడీపీ మరో రెండు (చోడవరం, మాడుగుల) నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. చోడవరం టికెట్ రేసులో నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు ఉన్నారు. పలుమార్లు నిర్వహించిన సర్వేల ఆధారంగా వీరిలో టికెట్ ఎవరికి ఇవ్వాలన్న దానిపై టీడీపీ అధిష్ఠానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. అభ్యర్థి ... మిగతా 8వ పేజీలో

గాజువాకకు పల్లా శ్రీనివాసరావు

- భీమిలిపై ఉత్కంఠ
- రేస్‌లో గంటా శ్రీనివాసరావు, కర్రోతు బంగార్రాజు, కోరాడ రాజబాబు
- విశాఖ పార్లమెంటు స్థానానికి ఎం.శ్రీభరత్ పేరు ఫైనల్

7లో



బండారు



పీవీజీ కుమార్



గవిరెడ్డి రామానాయుడు



పైలా ప్రసాదరావు

బీజేపీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్?



సీఎం రమేశ్

మూడు పార్టీల పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటును బీజేపీకి కేటాయించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్టు తెలిసింది. తొలుత టీడీపీ, జనసేన పొత్తుల నేపథ్యంలో అనకాపల్లి ఎంపీ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తారని, పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కూటమిలో బీజేపీ కూడా చేరడంతో ఇప్పుడు అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. సామాజిక సమీకరణల్లో భాగంగా కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ పేరును అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఆయన అభ్యర్థిత్వాన్ని ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. పారిశ్రామికవేత్త అయిన సీఎం రమేశ్ చాలా కాలంపాటు తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. 2012లో టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2018లో రెండోసారి కూడా టీడీపీ అవకాశం కల్పించింది. గత సాధారణ ఎన్నికల తరువాత ఆయన బీజేపీలో చేరారు. రాజ్యసభ పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తుండడంతో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అయితే అనకాపల్లి నుంచి సీఎం రమేశ్‌తోపాటు బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మహిళా మోర్చ నాయకురాలు తోట విజయలక్ష్మి పేర్లను కూడా పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

రేషన్‌కు నెట్ సిగ్నల్ కష్టాలు

మారుమూల ప్రాంతవాసులకు తప్పని ఇబ్బందులు

మారుమూల ప్రాంతాల్లో నెట్ సిగ్నల్స్ అందక ఈ-పోస్ యంత్రాలు పనిచేయడం లేదు. దీంతో రేషన్ పంపిణీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గిరిజన గ్రామాల్లో ఇంటర్నెట్ సదుపాయం అంతంతమాత్రంగా ఉండడంతో అవస్థలు తప్పడం లేదు. మండలంలోని రూడకోట పంచాయతీ కేంద్రంలో బుధవారం సిగ్నల్స్ అందక రేషన్ పంపిణీలో జాప్యం జరిగింది. గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో కార్డుదారులు అసహనం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాలకు ఆఫ్‌లైన్ విధానంలో రేషన్ పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. -పెదబయలు



రూడకోటలో సిగ్నల్ లేకపోవడంతో రేషన్ కోసం నిరీక్షిస్తున్న కార్డుదారులు

క్రైం... crime news

బాలికలపై అత్యాచారం కేసులో
ముద్దాయికి యావజ్జీవ కారాగారం

విశాఖపట్నం/నాతవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాలికలపై అత్యాచారం కేసులో నేరం రుజువుకావడంతో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.12 వేల రూపాయలు జరిమానా విధిస్తూ బుధవారం విశాఖ పోక్సో కోర్టు తీర్పు చెప్పింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నాతవరం గ్రామానికి చెందిన యర్రా సూరిబాబు అలియాస్ గూని సూరిబాబు (48)..2013 ఫిబ్రవరి ఆరో తేదీన చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపించి ముగ్గురు బాలికలను మేడపైకి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ముగ్గురిలో ఒక బాలిక జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. ఈ మేరకు సదరు బాలిక తండ్రి నాతవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు చిన్నారులను విచారించి కోర్టుకు ఆధారాలను సమర్పించారు. దీంతో నిందితుడికి పోక్సో కోర్టు కఠిన శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. కేసులో నేర నిరూపణకు ప్రాథమిక, భౌతిక, సాంకేతిక ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పించినట్టు పోలీసులు తెలిపారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేసినట్టు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా ఎస్‌ఐ పి.రమేష్, వాదనలు వినిపించిన అడిషనల్ పీపీ కరణం కృష్ణ, సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు, మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

సెజ్ సింబయోె కంపెనీలో ప్రమాదం

▸ ముగ్గురు కార్మికులకు గాయాలు

రాంబిల్లి, మార్చి 13: ఎస్ఈజెడ్‌లోని సింబయో జనరిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. స్థానిక పోలీసులు, కంపెనీ కార్మికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉదయం పదిన్నర గంటల సమయంలో కంపెనీలోని పలువురు కార్మికులు బాయిలర్ శుభ్రం చేసే క్రమంలో అందులోని వేడి నీటితో కూడిన ఆవిరి కార్మికులపై తూలింది. ఈ సంఘటనలో రాంబిల్లి మండలానికి చెందిన కె.సన్యాసిరావు, కె.నర్సింగరావు, చోడవరం మండలానికి చెందిన ఏ.రాములు గాయపడ్డారని తోటి కార్మికులు తెలిపారు. గాయపడిన వీరిని కంపెనీ యాజమాన్యం చికిత్స నిమిత్తం విశాఖలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు వారు తెలిపారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, రాంబిల్లి సర్కిల్ సీఐ లక్ష్మణరావు, అచ్యుతాపురం సీఐ బచ్చిరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కంపెనీ ప్రతినిధులు, కార్మికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రాంబిల్లి సర్కిల్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. సింబయో కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ డిమాండ్ చేశారు.

మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

అనకాపల్లి టౌన్, మార్చి 13: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద 15 మద్యం బాటిళ్లతో వెళుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని మద్యం దుకాణం నుంచి మద్యం కొనుగోలు చేసి సత్తెమ్మతల్లి ముఖద్వారం వైపు వెళుతున్న మునగపాక ప్రాంతానికి చెందిన వి. పూర్ణచంద్రరావును పట్టణ పోలీసులు తనిఖీ చేశారన్నారు. అతని సంచిలో 15 మద్యం బాటిళ్లు ఉన్నట్టు గుర్తించారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామని హెచ్‌సీ తెలిపారు.

గాజువాకకు పల్లా శ్రీనివాసరావు

▸ భీమిలిపై ఉత్కంఠ... రేస్‌లో గంటా, కర్రోతు, కోరాడ
▸ విశాఖ పార్లమెంటు స్థానానికి ఎం.శ్రీభరత్ పేరు ఫైనల్
▸ జనసేనకు 'సౌత్', పెందుర్తి.. బీజేపీకి 'నార్త్'

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు (ఆరు పూర్తిగా, మరొకటి పాక్షికంగా) ఉండగా...తెలుగుదేశం పార్టీ నాలుగు (భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక), జనసేన రెండు (విశాఖపట్నం సౌత్, పెందుర్తి), బీజేపీ ఒక (విశాఖపట్నం నార్త్) చోట పోటీ చేయనున్నాయి. ఆ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి జాబితాలో విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబుల పేర్లు ప్రకటించారు. జిల్లాలో మిగిలిన గాజువాక, భీమిలి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు గురువారం ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. గాజువాక సీటు పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు దాదాపు ఖరారైంది. కాగా భీమిలి విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. భీమిలి సీటును మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుతో పాటు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆశిస్తున్నారు. అయితే గంటాను విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబునాయుడు సూచించారు. ఈ నేపథ్యంలో తన వియ్యంకుడు పి.నారాయణతో కలిసి గంటా బుధవారం ఉదయం చంద్రబాబునాయుడును కలిశారు. దీంతో భీమిలి నుంచి ఎవరు బరిలో దిగుతారోనన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. 'సౌత్' సీటును జనసేనకు కేటాయించిన నేపథ్యంలో తగిన న్యాయం చేస్తామని అక్కడ ఇన్‌చార్జి గండి బాబ్జీకి అధినేత భరోసా ఇచ్చారు.

ఇక జనసేనకు కేటాయించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి చెల్లుబోయిన వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌బాబు, బీజేపీకి ఇచ్చిన విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్లు దాదాపు ఖరారైనట్టు చెబుతున్నారు.

పార్లమెంటు బరిలో ఎం.శ్రీభరత్?

విశాఖ లోక్‌సభ స్థానానికి టీడీపీ తరపున ఎం.శ్రీభరత్ పేరు దాదాపు ఖరారైంది. పొత్తులో భాగంగా బీజేపీ విశాఖ లోక్‌సభ సీటు తమకు కేటాయించాలని కోరింది. అయితే అందుకు చంద్రబాబునాయుడు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో శ్రీభరత్ పేరు ప్రకటన లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గురువారం ప్రకటించే జాబితాలో ఆయన పేరు ఉండే అవకాశం ఉంది.

కొత్త డిజైన్‌తో ఫ్లోటింగ్ బ్రిడ్జి


అలల వంతెన నిర్మాణానికి తెప్పించిన కొత్త బ్లాకులు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణా బీచ్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి అలల తాకిడిని తట్టుకోలేకపోతుండడంతో దాని డిజైన్‌ను మార్చాలని నిర్ణయించారు. ఇందుకోసం ముంబై నుంచి నిపుణులను రప్పించారు. వారు, వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులు కలిసి కొన్ని కొత్త డిజైన్లు రూపొందించారు. వాటిలో ఒక దానిని ఎంపిక చేసి ఆ ప్రకారం...మళ్లీ పునర్నిర్మిస్తున్నారు. దీనికోసం హై డెన్సిటీ పాలీఎథిలీన్ (హెచ్‌డీపీఈ) బ్లాకులు రప్పించారు. పాత బ్లాకులు ధృడంగా లేవని వీఎంఆర్‌డీఏ కమిషనర్ భావించడంతో దాని కంటే నాణ్యమైనవి తెప్పించారు. అలలు వచ్చేటపుడు వాటి ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం హై డెన్సిటీ పాలీఎథిలీన్ బ్లాకులకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఫ్లోటింగ్ బ్రిడ్జిపై రెండు వైపులా చిన్న చిన్న స్తంభాలతో రెయిలింగ్ ఏర్పాటు చేయగా, మధ్యలో కూడా మరో వరుస స్తంభాలు పెట్టాలని నిర్ణయించారు. కొత్త బ్లాకులతో తయారుచేసిన బ్రిడ్జిని పౌర్ణమి సమయంలో రెండు, మూడు రోజులు పరీక్షించి, పటిష్ఠంగా ఉందని నిర్ధారించుకున్నాకే పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

▸ మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ


అనకాపల్లి పట్టణ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి సమావేశంలో ఎన్నికల గుర్తు గాజుగ్లాసు చూపుతున్న అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బుద్ద నాగజగదీశ్వరరావు తదితరులు

అనకాపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు అనకాపల్లి సమగ్ర అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా పనిచేద్దామని, వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని కూటమి ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన, బీజేపీ పట్టణ విభాగాల నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ మూడు పార్టీల కలయికతో భవిష్యత్తులో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయన్నారు. అందరూ కలిసి పని చేస్తే విజయం సాధించడం పెద్ద పనేమీ కాదన్నారు. ఎన్నికల గుర్తు గాజు గ్లాసును చూపించి దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరారవు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ పట్టణ విభాగం నాయకులు నాగేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, కొణతాల రాజాబాబు, అలమండ శ్రీనివాసరావు, వర్మ, జనసేన నాయకులు శ్రీరాందాస్ గోవింద, దూలం గోపి, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, బర్నికాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాంకీ తాగునీటి పైపులైన్ పనుల అడ్డగింత

▸ గ్రీన్‌బెల్టు ఏరియాలో చెట్లు నరికి పనులు చేపట్టడంపై గ్రామస్థుల ఆగ్రహం


పైపులైన్ పనులను పరిశీలిస్తున్న తాడి గ్రామస్థులు

పరవాడ, మార్చి 13: రాంకీ యాజమాన్యం చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులను తాడి గ్రామస్థులు బుధవారం అడ్డుకున్నారు. గ్రీన్ బెల్టు ఏరియాలో గల చెట్లను నరికివేసి పైపులైన్ పనులను చేపట్టడంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తక్షణమే పైపులైన్ పనులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాదం శెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే ఫార్మా కాలుష్యంతో అల్లాడిపోతున్నామని, ఇటువంటి తరుణంలో గ్రీన్‌బెల్టు ఏరియాలో ఉన్న చెట్లను తొలగించి పైపులైన్ పనులు చేపట్టడం దారుణమన్నారు. గ్రామస్థుల ఆందోళనతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అనంతరం గ్రామస్థులు.. డీఆర్‌వో దయానిధిని కలిసి పైపులైన్ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొడ్డపల్లి అప్పారావు, కోమటి అచ్చిబాబు, జుత్తిక మాధవరావు, సూరిఅప్పారావు, పైడిరాజు, నూకరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన అవసరం

▸ కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 13: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రక్రియ ముందస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందన్నారు. అప్పటి నుంచి నియమావళి ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు, పార్టీలకు అవగాహన సమావేశాలు ఉంటాయని చెప్పారు. శాసనసభకు పోటీ చేసేవారు రూ.10 వేలు, లోక్‌సభకు పోటీ చేసేవారు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యర్థులు 50 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఈ వారంలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులు, తొలగింపులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలను ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

మార్కెట్లో ఉన్న ధరల ఆధారంగానే ఉపయోగించిన వాటి ధరలను నిర్ణయిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫెర్టిగేషన్‌తో బహుళ ప్రయోజనాలు

▸ ఎరువు వినియోగంలో 25 శాతం మేర ఆదా
▸ పైరు అంతటికీ సమంగా పోషకాలు
▸ పంట దిగుబడి 30-40 శాతం పెరుగుదల
▸ జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటలక్ష్మి


క్షేత్రస్థాయిలో ఫెర్టిగేషన్ పద్ధతిలో ఎరువుల వినియోగంపై శిక్షణ ఇస్తున్న డీఎంఐఏ వెంకటలక్ష్మి

బుచ్చెయ్యపేట, మార్చి 13: ఫెర్టిగేషన్ విధానం ద్వారా పంటలకు రసాయన ఎరువులను అందిస్తే వృథాను అరికట్టవచ్చని, అంతేకాక పైరు మొత్తానికి సమంగా ఎరువు అందుతుందని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి (డీఎంఐఏ) జి.వెంకటలక్ష్మి చెప్పారు. ఆమె బుధవారం మండలంలోని లోపూడిలో డ్రిప్ ద్వారా ఫెర్టిగేషన్ విధానంలో ఎరువుల వినియోగంపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మాట్లాడుతూ, నీటిలో కరిగిన ఎరువులను నేరుగా మొక్కల మొదళ్ల వద్ద అందించడం ద్వారా వృథాను అరికట్టవచ్చునన్నారు. దీని వల్ల ఎరువుల ఖర్చు, వినియోగం 25 శాతం తగ్గుతుందని, పంట దిగుబడి 30 నుంచి 40 శాతం పెరుగుతుందని చెప్పారు. ఫెర్టిగేషన్ పరికరాలు లేని పొలాల్లో పంటలకు ఎరువులను నేరుగా వేస్తుంటారని, భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే ముందే వేస్తారని, నత్రజని ఎరువును 2-3 దఫాలుగా వేస్తారని చెప్పారు. పైరుకు అవసరమైన ఎరువులను రెండు, మూడు నెలల ముందే వేయడం వల్ల అధిక శాతం ఎరువు వృథా అవుతుందని ఆమె వివరించారు. దీనివల్ల ఎరువుల ఖర్చు పెరుగుతుందని, పొలంలో భూసారం దెబ్బతింటుందని చెప్పారు. అందువల్ల డ్రిప్ యూనిట్‌కు ఫెర్టిగేషన్ పరికరాలను బిగించుకుని పైరుకు ఎరువులు అందించాలని ఆమె సూచించారు. అనంతరంలో పొలాలకు వెళ్లి ఫెర్టిగేషన్ యూనిట్ వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లోపూడి వీఏఏ బెన్నీ, రైతులు సాయం రఘునాథ్, వివేకానంద చౌదరి, వేణు చౌదరి, తమరాన దాసు, సయ్యపురెడ్డి మాధవరావు, గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి గోల్డ్ బాధితులు ప్రదర్శన


ప్రదర్శన నిర్వహిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

అనకాపల్లి టౌన్, మార్చి 13: అగ్రి గోల్డ్ బాధితులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా డిపాజిట్లు తిరిగి చెల్లించాలని అగ్రిగోల్డ్ బాధితులు బుధవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్, మెయిన్‌రోడ్డు, వన్‌వే జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అలాగే బైక్ ర్యాలీ కూడా నిర్వహించారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం, అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావులు మాట్లాడుతూ పదేళ్లుగా బాధితులు పోరాటం చేస్తున్నా అగ్రిగోల్డ్ యాజమాన్యానికి గాని, ప్రభుత్వానికి గాని చలనం లేదని విమర్శించారు. తాను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కేసులు, కోర్టులతో సంబంధం లేకుండా బాధితులందరికీ పరిహారం చెల్లిస్తానని, చనిపోయిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం పువ్వుల్లో పెట్టి ఇస్తానని వాగ్దానం చేసి ఐదేళ్లు గడిచినా వైసీపీ ప్రభుత్వం పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మొల్లేటి గోపాలరమణ, జెర్రిపోతుల దుర్గారావు, పొలమరశెట్టి శేషు, మజ్జి చినఅప్పారావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 13: జిల్లాలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1529 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో 332 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు ఉండగా 1197 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ జరిగేలా సుమారు 10 వేల మందిని ఎన్నికల విధులకు నియమించినట్టు ఆయన తెలిపారు.

పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం


పీఎం సూరజ్ పోర్టల్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన పీఎం నరేంద్ర మోదీ

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 13: పీఎం సూరజ్ పోర్టల్ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించగా, అనకాపల్లి కలెక్టరేట్ నుంచి అధికారులు, లబ్ధిదారులు బుధవారం తిలకించారు. ఈ పోర్టల్‌లో వివిధ పథకాలతో పాటు రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని బీసీ కార్పొరేషన్ ఈవో నిర్మల లబ్ధిదారులకు వివరించారు.

అరకు ఎంపీ, గాజువాక , అరకు అసెంబ్లీ స్థానాల్లో సీపీఎం పోటీ


వైజాగ్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విశాఖపట్నం, మార్చి 13: ఉమ్మడి విశాఖ జిల్లాలో అరకు పార్లమెంట్, అరకు, గాజువాక అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ పోటీచేయనున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం తెలిపారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన పార్టీ విశాఖ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అటవీ ప్రాంత పరిరక్షణ కోసం అనేక రూపాల్లో తమపార్టీ ఉద్యమిస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్, విశాఖ రైల్వేజోన్ సాధన, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై తమ పార్టీ కేంద్ర ప్రభుత్వంతో నేరుగా పోరాడుతోందన్నారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి.పద్మ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, బి.గంగారావు, ఆర్కేఎస్వీ కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి.జగన్, కేఎం శ్రీనివాసరావు, బి.రమణి, సుబ్బారావు, పైడిరాజు, శ్రీనివాసరాజు, రాంబాబు, వెంకటరావు, నరేంద్రకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇరువాడ గెడ్డ వాగుల ఆక్రమణపై విచారణ జరపాలి

▸ సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యురాలు ప్రభావతి


తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి.ప్రభావతి, ఉప్పాడ సత్యవతి

సబ్బవరం, మార్చి 13: మండలంలోని ఇరువాడ గ్రామం సర్వే నంబర్లు 103, 106 గెడ్డ స్థలం 3 ఎకరాల ఆక్రమణపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యులు బుధవారం స్థానిక తహసీల్దార్ జె. చలమయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరువాడలో గెడ్డ వాగుల ఆక్రమణలపై రైతులు ఆందోళనకు దిగారని, సమగ్ర దర్యాప్తు చేసి ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

▸ జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు


మామిడి సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

సబ్బవరం, మార్చి 13: జీడిమామిడి, మామిడి తోటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని అమృతపురంలోని జీడిమామిడి, మామిడి రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన.. సకాలంలో ఎరువుల వాడకం, కొమ్మ కత్తిరింపు, పురుగులు, తెగుళ్లకు గురికాకుండా తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు వివరించారు. తోటలను ఆశించే తేనెమంచు, కాయ తొలుచు పురుగు వల్ల నష్టం, నివారణ చర్యలు విశదీకరించారు. సకాలంలో పురుగుల మందులు పిచికారీ చేస్తే మామిడి, జీడి మామిడిలో తెగుళ్లను నివారించవచ్చునన్నారు. మండల ఉద్యాన శాఖాధికారి కిరణ్మయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ భావన, అమృతఫల బోర్డు డైరెక్టర్ వెన్నల అప్పలనాయుడు, సీఈవో కేఎల్ఎన్ మౌక్తిక, సభ్యులు నాగరాజు, బంగార్రాజు, నారాయణబాబు, అక్కునాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వైపు వైసీపీ నేతల చూపు

▸ చింతకాయల విజయ్‌ను కలిసిన మాకవరపాలెం నాయకులు
▸ తెలుగుదేశం పార్టీలో చేరికకు సుముఖం


చింతకాయల విజయ్‌తో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మాకవరపాలెం, మార్చి 13: మండలంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు బుధవారం నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్‌ను కలిశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అందువల్ల ఎన్నికల ముందు టీడీపీలో చేరే వారికి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తగిన ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. వైసీపీ నాయకులు మాట్లాడుతూ, మంచిరోజు చూసుకొని గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి టీడీపీలో చేరతామని చెప్పారు. విజయ్‌ను కలిసిన వారిలో రాచపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు జమిందార్, వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన బీసీ సెల్ మండల అధ్యక్షుడు అడిగర్ల శ్రీను, రామన్నపాలెం మాజీ సర్పంచ్ నక్కిన ప్రకాశ్, తదితరులు వున్నారు. ఈ భేటీలో అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, భీమబోయినపాలెం సర్పంచ్ నందకిశోర్, జోగిపాత్రుడు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించిన వరల్డ్ బ్యాంక్ బృందం


వార్డును పరిశీలిస్తున్న డాక్టర్ సందేశ్

అనకాపల్లి టౌన్, మార్చి 13: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని వరల్డ్ బ్యాంక్ బృందం బుధవారం సందర్శించింది. డాక్టర్ సందేశ్ వైద్యాలయంలోని రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగుల ఫీడ్‌బ్యాక్‌ను తెలుసుకున్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, వైద్య బృందం వున్నారు.

ఇంటర్ పరీక్షలకు 12,679 మంది హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 13: జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ఫిజిక్స్/ ఎకనామిక్స్ పరీక్షలకు 12,679 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్‌బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13,097 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 418 మంది హాజరు కాలేదన్నారు.



సింహద్వారానికి కొత్త గుమ్మం ఏర్పాటు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మోదకొండమ్మ ఆలయానికి మెరుగులు

పాడేరు రూరల్, మార్చి 13: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మ ఆలయానికి మెరుగులు దిద్దుతున్నట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. ఫైన్ యూనివర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని మీసాల దుర్గాప్రసాద్, వరలక్ష్మి దంపతులు ఆలయాభివృద్ధి పనులకు రూ.3 లక్షలు అందించారన్నారు. ఈ నిధులతో అమ్మవారి ఆలయ సింహద్వారానికి నూతన గుమ్మం ఏర్పాటు చేశామన్నారు. ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నరసింగరావు దంపతుల ఆధ్వర్యంలో బుధవారం శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, ఆలయ నిర్మాణ స్థల దాతలు లకే సింహాచలమమ్మ, వివప్రసాద్‌పాత్రుడు, ఈశ్వరి దంపతులు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, గ్రామ పెద్దలు నాగభూషణంరాజు, కొట్టగుళ్లి రామారావు, దెశిది బాబూరావు, వంతినభ రాజుబాబు, వర్తక సంఘ పెద్దలు బూరెడ్డి కృష్ణారావు, బూరెడ్డి నాగేశ్వరరావు, పూసర్ల గోపి, బుజ్జి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి

▸▸ జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్



బూదరాళ్ల పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌వోలకు సూచనలు ఇస్తున్న జేసీ

కొయ్యూరు, మార్చి 13: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్ ఆదేశించారు. మండలంలోని బూదరాళ్ల, మర్రివాడ, రాజేంద్రపాలెం, కొయ్యూరు, శింగవరం, చిట్టింపాడు తదితర పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. ప్రతీ కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను సూచించారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ సీరియస్‌గా ఉన్నందున నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరరావు, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, మంప ఎస్‌ఐ దేముడు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పీవో



పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలపై అధికారులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

హుకుంపేట, మార్చి 13: మండలంలోని పలు పోలింగ్ కేంద్రానలకు అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్ బుధవారం సందర్శించారు. గుడుగుపాలి, సంతారి, రాపదుర్గం, మత్స్యపురం, తురుకలమెట్ట, తాడిపుట్టు చీకుమద్దుల తదితర కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. పరిశీలనకు హుకుంపేట ఎంఈవో చెల్లయ్య హాజరుకాలేదని, నోటీసు జారీ చేయాలని ఏఈఆర్‌వోను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థుల మరణాలను అరికట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

పాడేరు రూరల్, మార్చి 13: జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ఆకస్మిక మరణాలపై అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.సూర్యారావు డిమాండ్ చేశారు. ఏబీవీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల, కళాశాల్లో విద్యార్థులు మరణిస్తున్నా అధికారులు స్పందించకపోవడం విచారకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని, ప్రతి నెలా విద్యార్థులకు వైద్య సిబ్బందితో ఆరోగ్య తనిఖీలు చేయించాలని, మెనూ సక్రమంగా అమలుచేసి పౌష్టికాహారాన్ని అందించాలని విన్నవించారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు జి.జయకుమార్, కె.శ్రీను, రామచంద్ర, పంతులు పాల్గొన్నారు.

తాజంగిలో గర్భిణులకు భోజన సదుపాయం



పీహెచ్‌సీలో గర్భిణులకు భోజనాలు పెడుతున్న ఆశ కార్యకర్త

చింతపల్లి, మార్చి 13: మండలంలోని తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దాతల ఆర్థిక సాయంతో గర్భిణులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. పీహెచ్‌సీలో నెలలో రెండు సార్లు వైద్య పరీక్షలు చేస్తుంటారు. ఆస్పత్రికి సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న గర్భిణులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని వైద్యాధికారి సంతోష్‌కుమార్ గత వారం వ్యక్తిగత నిధులతో గర్భిణులకు భోజనాలు సమకూర్చారు. ఈ విషయం తెలుసుకున్న నర్సీపట్నం ది హోప్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు అనిశెట్టి చిరంజీవి, లక్ష్మి దంపతులు బుధవారం గర్భిణులకు భోజనాలు పెట్టారు. రానున్న రోజుల్లోనే గర్భిణులకు భోజనాలు పెడతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. వారిని డాక్టర్ సంతోష్‌కుమార్ అభినందిస్తూ, మరికొంత మంది దాతలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ కేఎస్ కుమార్‌బాబు, పర్యాటక వికాస్ ఛైర్మన్ శెట్టి శంకర్ పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలతో ఇంటిల్లపాదికి ఆర్థిక లబ్ధి

▸▸ టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి దొన్నుదొర



పినకోట గ్రామస్థులతో మాట్లాడుతున్న దొన్నుదొర

అరకులోయ, మార్చి 13: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలతో ఇంటిల్లపాది ఆర్థిక లబ్ధి చేకూరుతుందని పార్టీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర చెప్పారు. అనంతగిరి మండలంలోని పెదకోట, పినకోట పంచాయతీల్లో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్-6 పథకాలను వివరించారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే సూపర్-6 పథకాలు అమల్లోకి వస్తాయని చెప్పారు. ఈ పథకాలతో ఇంటిలో ఉన్న వారందరికీ ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను ప్రతీ ఇంటికి పంపిణీ చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సూచించారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి ఎక్కడా ఎటువంటి అభివృద్ధి లేకుండా అసమర్థ పాలన సాగిస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుతో పాటు అన్ని వర్గాల వారికి మేలు చేకూర్చే విజనరీ నాయకుడు, పరిపాలనా దక్షుడు చంద్రబాబునాయుడును వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిని చేసుకోవాల్సి అవసరం ఉందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ప్రజల సమస్యలను దొన్నుదొర అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని దొన్నుదొర హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ అనంతగిరి మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు, జనసేన మండల అధ్యక్షుడు చిట్టెం మురళి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వంతల నాగేశ్వరరావు, జన్ని అప్పారావు, వంతల సుబ్బారావు, వెంకట్రావు, శంకర్రావు, చిట్టిబాబు, దేముడు, ఎస్.కొండబాబు, పి.మల్లేశ్వరి, జి.బొంజునాయుడే, దూరి సన్యాసిదొర, ఎస్.అప్పలరాజు, జాకీరు అప్పలకొండ, గణేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

▸▸ ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరు అప్పలనాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొడూరు అప్పలనాయుడు

అరకులోయ, మార్చి 13: దివ్యాంగులకు ఇప్పటివరకు ఇస్తున్న పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షుడు కొడేరు అప్పలనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం భవనంలో ఎన్‌పీఆర్‌డీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అప్పలనాయుడు మాట్లాడుతూ మార్కెట్‌లో అన్ని రకాల నిత్యావసర సరుకులు సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయలేనంత స్థాయిలో ధరలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని దృష్టిలో పెట్టుకుని దివ్యాంగుల పింఛన్ పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే దివ్యాంగుల వివాహ ప్రోత్సాహన్ని రూ.5 లక్షలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను అందించాలని ఆయన కోరారు. వికలాంగుల చట్టం-2016 అమలు కాకపోవడంతో రాష్ట్రంలోని 25 లక్షల మంది దివ్యాంగులకు భద్రత, సంక్షేమం లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అమలు చేయాల్సిన సంక్షేమ పథకాల్లోనూ పాలకులు కోతలు విధించడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో లక్షలాది ఓటర్లుగా ఉన్న దివ్యాంగులు తమకు భద్రతతో కల్పించే పార్టీకి అండగా నిలవాలని సూచించారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వెంకట్రావు, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత నిధులు విడుదల: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల, మార్చి 13: జిల్లాలో చేయూత నిధులు విడుదల చేసినట్టు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన నాలుగో విడత చేయూత సంబరాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నదని చెప్పారు. అంతకుముందు మండలానికి చెందిన 2,756 మంది చేయూత లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రాంబాబు, మత్స్యకొండబాబు, సన్యాసిదొర, ఎల్.కల్యాణ్, కొండబాబు, చిన్నాబాబు ఆచారి, రామకృష్ణ, ప్రవీణ్, సాయి పాల్గొన్నారు.

పసుపు యాజమాన్య పద్ధతులపై మోడల్ రైతులకు శిక్షణ

పాడేరు రూరల్, మార్చి 13: మండలంలో పసుపు పండించే 60 మంది మోడల్ రైతులకు స్నేల్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎస్‌పి సహకారంతో రెండు రోజులు శిక్షణ అందించారు. ఈ శిక్షణలో భూమి కలియ దున్నడం నుంచి పసుపు దుబ్బులు తీసే వరకు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులతో పాటు పసుపులో వచ్చే దుబ్బుకుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగులు, నివారణ చర్యలపై జిల్లా ఉద్యానవన శాఖాధికారి మాధురి శిక్షణ అందించారు. అనంతరం మోడల్ రైతులకు పసుపు సాగు సూచనలు గల డైరీలను పంపిణీ చేశారు. పసుపులో వ్యాల్యూ ఎడిషన్ చేసి పసుపు పొడిగా అమ్మడం వల్ల రైతులు అధిక లాభాలను పొందవచ్చని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. పసుపులో పోస్టు హార్వెస్టింగ్ పద్ధతులు పాటించిన రైతులకు పసుపు నాణ్యత ఎక్కువగా ఉంటుందని వివరించారు. కుర్‌కుమిన్ కంటెంట్ ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువ ధర లభించడంతో అధిక లాభాలను పొందవచ్చని ఆవె చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్నేల్ సంస్థ ప్రతినిధులు మురళి, రవి, ఉద్యానవన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి హుండీ ఆదాయం లెక్కింపు

ముంచంగిపుట్టు, మార్చి 13: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో గంగమ్మతల్లి ఉత్సవాలు ముగియడంతో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ కమిటీ ఛైర్మన్, తహసీల్దార్ రఫీ, సర్పంచ్ వి.రమేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శంకరావు తదితరుల సమక్షంలో హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ హుండీ లెక్కింపు చేపట్టగా రూ.30,022 రూపాయలు నగదు రూపంలో అమ్మవారికి కానుకలు వచ్చినట్టు గుర్తించామని చెప్పారు. ఈ సొమ్మును ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి వి.నీలకంఠం, డిప్యూటీ తహసీల్దార్ అప్పలరాజు, ఆర్ఐ రవికుమార్, ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులు నానిబాబు, మదన్, సురేష్, రామ్మూర్తి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌పై సిబ్బందికి అవగాహన


గూడెంకొత్తవీధి, మార్చి 13: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల కోడ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ పాపారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల్లో కోడ్‌కు సంబంధించిన అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించామని ఎంపీడీవో తెలిపారు. నోటిఫికేషన్ వచ్చిన 24 గంటల్లోగా కార్యాలయాల్లో ఉన్న పోస్టర్లను తొలగించాలని చెప్పారు. అలాగే పబ్లిక్ ప్రదేశాల్లో 48 గంటల్లో, ప్రైవేట్ ప్రదేశాల్లో 72 గంటల్లో పోస్టర్లను తొలగించాలని సూచించినట్టు ఎంపీడీవో చెప్పారు. అలాగే ఆయా ప్రదేశాల్లో అసాంఘిక చర్యలు జరిగితే ప్రత్యేక బృందాలు మండల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడైనా సమావేశాలు నిర్వహిస్తే అనుమతులు ఉన్నాయా? లేదా? అని ఆరా తీయాలని, అనుమతులు లేకపోతే తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు. సీఎం ఉత్తర్వులు, ఆరోగ్యశ్రీ కార్డులు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన పనులు ఎన్నికల కోడ్‌కు ముందే ముగించాలని ఎంపీడీవో సూచించారు.

గ్రామాల్లో దశలవారీగా కాలువల నిర్మాణం

ముంచంగిపుట్టు, మార్చి 13: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా కాలువల నిర్మాణం పనులు జరిగే విధంగా తనవంతు కృషి చేస్తానని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి చెప్పారు. మండలంలోని వనగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో బుధవారం డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనస గ్రామంలో ఎంపీపీ కోటా నిధులు రూ.5 లక్షలు వెచ్చించి కాలువలను నిర్మించినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మారుమూల గ్రామాల్లో సైతం డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం పనులు జరిగే విధంగా తగిన చర్యలు చేపడుతున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.మిల్కీ పాల్గొన్నారు.

సొలభంలో సీతారాముల విగ్రహావిష్కరణ

జి.మాడుగుల, మార్చి 13: మండలంలోని సొలభం కాలనీలో బుధవారం సీతారాముల వారి విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపట్టినట్టు దేవదాయ శాఖ ఏఈ తలారి సతీష్ తెలిపారు. టీటీడీ నిధులతో నిర్మించిన ఈ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు ఆయన చెప్పారు.



పౌష్టికహారం కిట్లను అందిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ భాషా

టీబీ బాధితులు మందులను సక్రమంగా వాడాలి

▸▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా

పాడేరు రూరల్, మార్చి 13: టీబీ బాధితులు మందులను సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా సూచించారు. జిల్లా వ్యాప్తంగా టీబీ రోగులకు బుధవారం పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. అలాగే కొంత మందికి ఫుడ్ బిస్కెట్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా వ్యాప్తంగా అన్నిరకాల క్లినికల్ రిజిస్టర్లు, రోగులకు కావాల్సిన ట్రీట్‌మెంట్ కార్డ్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్.ఎల్.పూర్వజ, జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పాంగి శేషగిరి వెంకటేశ్వర్లు, డీఎస్పీ రామరాజు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



ఓటు వేసేవిధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, మార్చి 13: ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సి అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ కలెక్టర్ శర్మ సూచించారు. మండల కేంద్రంతో పాటు పలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటు వేసే విధానంపై బుధవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఈవీఎంల ద్వారా తమ ఓటును ఎలా వేయాలో తెలియజేశారు. అలాగే ఓటు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రఫీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంగడ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టికెట్ టెన్షన్!

... 5వ పేజీ తరువాయి

పేరు మలి విడత జాబితాలో ఉంటుందా?, లేదా?...అన్నది మరికొన్ని గంటల్లోనే తెలుసుంది. మాడుగుల టికెట్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు ఆశిస్తున్నారు. వీరిలో ఒకరికి టికెట్ ఇవ్వాలా? లేకపోతే పొత్తులో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో గత ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల టికెట్ ఇవ్వాలా? అనే దానిపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇక పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ పోటీ చేయడం దాదాపు ఖాయమైనట్టు సమాచారం.

బలిమెల నీటి పంపకాలపై సమీక్ష

... 5వ పేజీ తరువాయి

నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల మధ్య ఏకగ్రీవంగా ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో ఒడిశా తరఫున బలిమెల హైడ్రో ప్రాజెక్టు జనరల్ మేనేజర్ కృపాసింధు బిస్వాల్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు జ్యోతిర్మయి దాస్, ప్రశాంత్‌కుమార్ మిశ్రా, అసిస్టెంట్ మేనేజర్ రాకేష్ పాణిగ్రహి, పొట్టేరు ఇరిగేషన్ ప్రాజెక్టు సీఈ పితబాస్ శెట్టి, చిత్రకొండ ఎర్త్‌డ్యాం డివిజన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమాకాంత్ పాత్రో, ఏఈఈ తుషార్‌రంజన్ కుంతి, ఏఈలు గదాధర్ ప్రధాన్, కెసిఫానిలు పాల్గొనగా, ఆంధ్రా తరఫున ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ జి.ప్రభాకరరావు, ఏడీఈ టి.వెంకటమధు పాల్గొన్నారు.

ప్రమాదాల్లో గోల్డెన్ అవర్‌పై అవగాహన కల్పించాలి

... 5వ పేజీ తరువాయి

సమయం(గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో అందించే ప్రథమ చికిత్సలే బాధితుల ప్రాణాలను కాపాడతాయన్నారు. అటువంటి గోల్డెన్ అవర్‌పై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రాణదాతలుగా గుర్తింపు పొందడంపై చైతన్యం తీసుకురావాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో సేవలు అందించిన ప్రాణదాతలకు ప్రభుత్వం నుంచి రూ.5 వేలు పారితోషికం అందిస్తామనే విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలను నడిపిన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం ఎన్నికల సమయం నేపథ్యంలో వాహనాల్లో డబ్బులు, మద్యం, గంజాయి, నాటుసారా వంటివి అక్రమంగా రవాణా అయ్యే అవకాశాలున్నాయని, డ్రైవర్లను అప్రమత్తం చేయాలన్నారు. పోలీస్, రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రతా చర్యలపై మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, జిల్లా రవాణాశాఖాధికారి లీలాప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, ప్రజా రవాణా సంస్థ స్థానిక డీఎం ఉమాశంకర్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ ఈఈ బాలసుందరబాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వాసు, రాజేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పాడేరు అసెంబ్లీ టిక్కెట్ టీడీపీకి కేటాయించాలి

పాడేరు రూరల్, మార్చి 13: సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ టిక్కెట్‌ను టీడీపీ అభ్యర్థికే కేటాయించాలని పార్టీ నేతలు కొట్టగుళ్లి సుబ్బారావు, కేవీ రమేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు విజయవాడలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడును బుధవారం కలిసి విన్నవించారు. నియోజకవర్గంలో కలిసికట్టుగా పనిచేసి టీడీపీ జెండాను ఎగరవేస్తామని, పొత్తుల కారణంగా ఇతర పార్టీలకు టిక్కెట్ కేటాయిస్తే పార్టీ కార్యకర్తలు ఇబ్బందులకు గురవుతున్నారని అచ్చెంనాయుడుకు వివరించినట్టు వారు చెప్పారు.

కొట్నాపల్లిలో నల్లరాయి క్వారీ మూసేయాలి: సీపీఐ

హుకుంపేట, మార్చి 13: మండలంలోని కొట్నాపల్లి గ్రామానికి ఆనుకుని ఏర్పాటు చేసిన నల్లరాయి క్వారీని మూసేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్వారీ పేలుళ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్న కొట్నాపల్లి వాసులతో బుధవారం సీపీఐ నేతలు అమర్, రాధాకృష్ణ, చంటిబాబు తదితరులు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గతంలో ఇక్కడ కేవలం నల్లరాయి క్రషర్ మాత్రమే నిర్వహించారని, ఇటీవల కాలంలో బ్లాస్టింగ్‌లు చేయడంతో గ్రామంపైకి రాళ్ల ముక్కలు, దుమ్మూధూళి వస్తున్నదని గిరిజనులు తెలిపారు. రాళ్ల పేలుళ్లతో గోడలు బీటలు వారడంతో పాటు గ్రామంలో వీధుల్లో సంచరించే వారిపై రాళ్ల ముక్కలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక ఇంట్లోకి వచ్చిన రాయి ముక్క టీవీకి తగలడంతో అది పాడైపోయిందని గిరిజనులు తెలిపారు. గిరిజనుల జీవనానికి ఇబ్బందికరంగా మారిన నల్లరాయి క్వారీని మూసేందుకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు.

జాతీయ రహదారికి అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం

చింతపల్లి, మార్చి 13: మండలంలో జాతీయ రహదారికి అనుకుని అవసరమైన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఇందుకోసం బుధవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి బుధవారం భూ సేకరణ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిని అనుసంధానిస్తూ అంతర్ల, దామనాపల్లి, లోతుగెడ్డ కూడలి, చిత్రాలగొప్పు, దిగువపాకలు, రాజుపాకలు, లంబసింగి తదితర గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ గ్రామాలకు సర్వీసు రోడ్డు నిర్మాణానికి ఎన్‌హెచ్ విభాగం ముందుకు రావడంతో భూ సర్వే చేపడుతున్నట్టు చెప్పారు.

నాటు తుపాకులను అప్పగించాలి: సీఐ

పాడేరు రూరల్, మార్చి 13: మండలంలో నాటు తుపాకులు ఉన్నవారు పోలీసు స్టేషన్‌లో అప్పగించాలని సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్ సూచించారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2024 జనరల్ ఎన్నికల దృష్ట్యా లైసెన్స్‌డ్, అన్‌లైసెన్స్‌డు తుపాకులు వాడడం, కలిగి ఉండడం ఎన్నికల నియమావళి ప్రకారం నేరమన్నారు. వారంలోగా తుపాకును అప్పగించని పక్షంలో, సదరు వ్యక్తులపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని సీఐ హెచ్చరించారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోండి

చింతపల్లి, మార్చి 13: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సీడీపీవో బీవీ రమణ సూచించారు. మండల కేంద్రంలోని ముత్యాలమ్మ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పోషకాహార ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలతో పాటు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యకరమన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు కె.విజయకుమారి, ఎస్కే గౌహర్ ఉన్నీష, సిహెచ్.సత్యవతి, పి.అప్పలనర్సమ్మ, గౌరి పాల్గొన్నారు.

పోషకాహారంపై గర్భిణులకు అవగాహన

హుకుంపేట: మండలంలోని రంగశీల, బారపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎం.దేవి మాట్లాడుతూ చిరుధాన్యాలతో సొంతంగా ఆహార పదార్థాలు తయారు చేసుకుని తింటే ఆరోగ్యంగా, బలంగా ఉంటారన్నారు. ప్రధానంగా పిల్లలకు చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను తినిపించడం మంచిదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు

జాకరగుడ గెడ్డపై వంతెన ప్రారంభం

డుంబ్రిగుడ, మార్చి 13: మండలంలోని కంద్రుం పంచాయతీ శివారు గ్రామాలకు ఆనుకుని జాకరగుడ గెడ్డలో వంతెనను ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ బుధవారం ప్రారంభించారు. రూ.5.8 కోట్లతో ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, సర్పంచ్ హరి, నాయకులు కృష్ణారావు, సింహాచలం, వినోద్, గోపాల్, శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టల పంపిణీ

కొయ్యూరు, మార్చి 13: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిప్యూటీ తహసీల్దార్ డి.సత్యనారాయణ బుధవారం అట్టలు పంపిణీ చేశారు. కొయ్యూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల-2 విద్యార్థులకు అట్టలు, పెన్నులు తదితర సామగ్రిని అందించారు. అనంతరం పాఠశాల సిబ్బంది డీటీను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ బంగారు భవిష్యత్తుకు పదో తరగతి తొలి మెట్టని, అందువల్ల చదువుపై దృష్టిసారించి పరీక్షల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో చైతన్య, వీఆర్‌వో పండయ్య, కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్, హెచ్‌ఎం బాలమురళి, హెచ్‌డబ్ల్యూవో వేణు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కొయ్యూరు, మార్చి 13: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని నడింపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం మహేంద్ర సూచించారు. బుధవారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. సమాజంలో చెడును దూరంగా పెట్టి మంచిని స్వీకరించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వార్డెన్ రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.